పేదల సంక్షేమానికి 'సురక్ష'

- ప్రజల ముంగిటకే ధ్రువ పత్రాలు
- 11 రకాల పత్రాలు ఉచితంగా ప్రభుత్వం జారీ
- వలంటీర్ల సేవలు మరింత విస్తృతం
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

ఓర్వకల్లు: ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం నిరుపేద ప్రజలకు శ్రీరామ రక్షగా నిలుస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందనివారిని గుర్తించి, వారికి తక్షణమే అందించేలా చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సురక్ష పథకానికి శ్రీకారం చుట్టారు. వలంటీర్లు వారి పరిధిలోని ఇళ్ల వద్దకు వెళ్లి సమస్యలను గుర్తించి పరిష్కారానికి అధికారులు కృషి చేస్తారు. అందులో భాగంగానే అధికారులు మొదటగా కాల్వ, హుసేనాపురం, నన్నూరు గ్రామాలను ఎంపిక చేశారు. అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి ప్రజలకు అవసరమైన సమస్యలపై వినతులు స్వీకరిస్తారు.

500 ధ్రువ పత్రాల పంపిణీ

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా హుసేనాపురం గ్రామంలోని రెండు సచివాలయాల పరిధిలో కలిపి మొత్తం 1,680 కుటుంబాలను సర్వే చేసి, ప్రజలకు అవసరమైన 500 ధ్రువ పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. మిగతా రెండు గ్రామాలలో సర్వే కనసాగుతోంది. ఆయా గ్రామాలలో అధికారుల బృందం ప్రజల వద్దకు వెళ్లి వినతులు స్వీకరిస్తారు. ప్రజలు ఈ అవకాశాలను సక్రమంగా వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ కార్యక్రమం ఈ నెల ఆఖరు వరకు కొనసాగించాలని ప్రభుత్వం నిర్దేశం కాగా, ఆ దిశగా అధికార యంత్రాంగం నిమగ్నమైంది. సచివాలయాలలో 11 రకాల సేవలను ఉచితంగా అందజేస్తోంది. అధికారులు సేకరించిన వినతులను సంబంధిత అధికారులు పరిశీలించి వారం, పది రోజుల్లో లబ్ధిదారులకు అందజేస్తారు. ప్రస్తుతం హుసేనాపురం గ్రామంలో ఈ కార్యక్రమం ద్వారా సత్ఫలితాలు రావడంతో ఈ పథకం గూర్చి ప్రజల్లో సంతోషం వెల్లివిరుస్తోంది.


హుసేనాపురంలో మహిళకు ధ్రువ పత్రాన్ని అందజేస్తున్న వలంటీరు

ప్రజల మేలు కోరుతున్న జగన్


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం ప్రజల మేలు కోరుతున్నారు. నేను గ్రామంలో 4 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాను. వారం రోజుల క్రితం అధికారులు మా ఇంటికి వచ్చి సమస్యను అడిగి వినతి పత్రాన్ని స్వీకరించారు. వారం రోజులకే కౌలు కార్డును అందజేయడంతో చాలా ఆశ్చర్యమనిపించింది. గతంలో ఇదే కార్డు కోసం ఇటు రైతులను ఒప్పించుకోవడమేగాక, అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. పైగా నేను వికలాంగుడను కావడంతో నాలాంటి వారికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుంది.
– నన్నూరు మద్దిలేటి, కౌలు రైతు, హుసేనాపురం

ఇంటి వద్దకే ధ్రువపత్రాలు వచ్చాయి


అధికారులు ఇంటి వద్దకే వచ్చి మాకు అవసరమైన కులం, ఆదాయ ధ్రువ పత్రాలను అందజేయడం ఎంతో సంతోషంగా ఉంది. గతంలో మండల కార్యాలయాల చుట్టూ తిరిగినా సకాలంలో ధ్రువ పత్రాలు అందక కొన్ని అవకాశాలు కోల్పోవాల్సి వచ్చేది. ప్రస్తుతం పేదల ఇబ్బందులను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన సురక్ష పథకం ద్వారా ఎంతో మంది పేదలు, అభాగ్యులకు మేలు జరుగుతోంది.
– గొల్ల బుగ్గన్న, హుసేనాపురం

చిటికెలో పని జరిగింది


కొన్నేళ్ల నుంచి మా పొలం ఆన్‌లైన్‌లో ఎక్కక పోవడంతో కార్యాలయాల చుట్టూ తిరిగా. కానీ ఫలితం లేకుండా పోయింది. దీంతో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందక ఇబ్బందులు పడ్డాను. జగనన్న సురక్ష కార్యక్రమం సర్వేలో భాగంగా వలంటీరు, అధికారులు మా ఇంటి వద్దకు వచ్చినప్పుడు వారికి నా పొలం అన్‌లైన్ సమస్యను వివరించా. దీంతో వారు అన్‌లైన్‌లో నమోదు చేశారు. వారం రోజుల అనంతరం గడివేముల సచివాలయం వద్ద నా పొలం అన్‌లైన్‌లో నమోదైనట్లు సర్టిఫికెట్ అందజేశారు. నిరుపేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందిస్తున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటా. –దూదేకుల గఫూర్, గడివేముల

క్లుప్తంగా

93 శాతం పింఛన్ల పంపిణీ


ఓర్వకల్లులో చాకలి మంగమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నగేష్

ఓర్వకల్లు: మండలంలో ఆదివారం నాటికి 93 శాతం మందికి పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ తెలిపారు. మండలంలో వివిధ కేటగిరీలలో కలిపి 7,540 మంది పింఛన్‌దారులు వుండగా అందులో రెండు రోజుల్లో కలిపి 7,045 మందికి వలంటీర్లు నగదు అందజేసినట్లు తెలిపారు. మిగతా 495 మందికి వీలైనంత వరకు మరో రెండు రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ


తిరుపాడులో వికలాంగురాలు లోకేశ్వరికి పింఛన్ అందిస్తున్న వలంటీరు నాగార్జున

గడివేముల: మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో రెండో రోజు ఆదివారం సైతం లబ్ధిదారులకు పింఛన్లను వలంటీర్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి వేలి ముద్రలు, ఐరిష్ ద్వారా సొమ్మును అందించారు. దీంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్పందనను సద్వినియోగం చేసుకోండి

గడివేముల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని గడివేముల తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం కోరారు. ఆయా గ్రామాల్లోని రైతుల, ప్రజలు సమస్యలను అర్జీ రూపంలో ఇవ్వాలన్నారు. మండలస్థాయి అధికారులందరూ ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంటారని, సమస్యలను పరిశీలించి పరిష్కారించడం జరుగుతుందన్నారు.

సీసీఎల్‌ఏ అధికారినంటూ డబ్బు డిమాండ్

పాణ్యం: గతంలో పాణ్యం తహసీల్దార్‌గా పని చేసిన నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. అమరాతిలో సీసీఎల్‌ఏ అధికారినంటూ ఓ వ్యక్తి తనకు పదేపదే ఫోన్ చేసి డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. మీ ఫైల్ ముందు సాగాలంటే తనకు రూ. 30 వేలు ఇవ్వాలని ఫోన్ చేసి బెదిరిస్తున్నాడన్నారు.

ఉద్యానపంటల సాగుకు ముందుకు రావాలి


రైతులకు టెంకాయ మొక్కలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ బొంతల మునెప్ప

సి.బెళగల్: ఉద్యాన పంటల సాగుకు రైతులు ముందుకు రావాలని ఎంపీపీ బొంతల మునెప్ప పిలుపునిచ్చారు. ఉపాధి హామి పథకంలో భాగంగా రైతులకు మంజూరైన టెంకాయ మొక్కలను ఆయన రైతులకు పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం పండ్లు, పూల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రైతులకు సూచించారు. మొదటి విడతలో భాగంగా మండలానికి మంజూరైన 3,500 టెంకాయ మొక్కలను రైతులకు అందజేశామని ఉపాధి హామీ ఈసీ పృధ్వీరాజ్ తెలిపారు.

నేటి నుంచి కంబదహాల్‌లో గురు పూర్ణిమ వేడుకలు


పూజలు అందుకుంటున్న సాయిబాబా

సి.బెళగల్: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు గురు పూర్ణిమ వేడుకలను నిర్వహించనున్నట్లు సాయి భక్తులు తెలిపారు. గ్రామంలో సాయినాథుడి విగ్రహం ప్రతిష్ఠించుకుని ఏడాది అవుతుండటంతో పాటు సోమవారం గురు పూర్ణిమ కావడంతో పెద్ద ఎత్తున అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాల నిర్వహణకు సిద్ధం చేశామన్నారు. సోమ, మంగళ వారాలలో ఆలయంలోని సాయిబాబాకు కాగడ హారతి, సాయి స్తోత్రముల పఠనము, నిత్య ప్రార్థన, చందనోత్సవం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యం


అధికారులతో మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్
- జగనన్న సురక్షపై అధికారులతో సమావేశం

కర్నూలు (న్యూటౌన్): అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. ఆదివారం కోడుమూరు ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుంచి 29వ తేదీ వరకు కోడుమూరు, గూడూరు, సి బెళగల్, కర్నూలు మండలాల్లో జగనన్న సురక్ష, జగనన్న అమ్మఒడి, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. అనంతరం ఆయా కార్యక్రమాల షెడ్యూల్‌ను ప్రకటించారు. సమావేశంలో కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్, సి బెళగల్ ఎంపీడీఓ రాముడు, గూడూరు ఎంపీడీఓ మాధవీలత, కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడు, కోడుమూరు తహసీల్దార్ జయన్న తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం నందనపల్లె గ్రామానికి చెందిన కొండూరు మాధురి, వెంకటేశ్వర్లు దంపతుల కుమార్తె అనారోగ్యం కారణంగా కర్నూలులో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ సిఫారసుతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.2లక్షలు మంజూరయ్యాయి. దీంతో ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో బాధిత కుటుంబానికి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో గార్గేయపురం మాజీ సర్పంచ్ ఏసేపు తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

రైతులకు కనక వర్షం...

- భారీగా బీమా సొమ్ము మంజూరు
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

కోడుమూరు : గతేడాది వాతావరణ పరిస్థితుల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్రప్రభుత్వం భారీ ఎత్తున బీమా సొమ్మును మంజూరు చేసింది. దెబ్బతిన్న ఉల్లి, పత్తి, వెరుశనగ, మొక్కజొన్న తదితర పంటలకు ప్రభుత్వం పంట నష్టపరిహారం మంజూరు చేసింది. కర్నూలు జిల్లాలో అత్యధికంగా కల్లూరు మండలంలోని రైతులకు పంట నష్టపరిహారం మంజూరైంది. రెండవ స్థానంలో కోడుమూరు మండలంలోని రైతులకు దక్కింది. వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద 2022 ఖరీఫ్‌కు సంబంధించి వాతావరణ బీమా, ఫసల్ బీమా కర్నూలు జిల్లాకు రూ.192.47 కోట్లు మంజూరయ్యాయి. కోడుమూరు మండలంలో 30,535 మంది రైతులు పంటలను నష్టపోగా రూ.25.85 కోట్లు మంజూరయ్యాయి. ఆదోని మండలంలో 1,770 మంది రైతులు పంటలు నష్టపోగా రూ.1.52 కోట్ల కేటాయింపు జరిగింది. ఆలూరు మండలంలో 60,740 మంది రైతులు పంటలను నష్టపోగా రూ.47.19 కోట్లు, మంత్రాలయం మండలంలో 34,718 రైతులు పంటలను నష్టపోగా రూ.14.83 కోట్లు, పాణ్యం మండలంలో 13,124 మంది రైతులు నష్టపోగా రూ.15.47 కోట్లు మంజూరయ్యాయి. అదేవిధంగా పత్తికొండ మండలంలో 64,840 మంది రైతులు పంటలను కోల్పోగా రూ.61.20 కోట్లు, ఎమ్మిగనూరు మండలంలో 36,659 మంది రైతులు పంటలను నష్టపోగా రూ.26.30 కోట్లు మంజూరయ్యాయి. పంటలను నష్టపోయిన రైతుల జాబితాను ఇప్పటికే సచివాలయాల్లో ప్రదర్శించారు. ఈ నెల 8వ తేదీన నేరుగా రైతులు బ్యాంకు ఖాతాల్లోనే ప్రభుత్వం నగదు జమ చేస్తుందని అధికారులు తెలిపారు.

యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం

కర్నూలు(హాస్పిటల్): యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుందని కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి, కార్డియాలజిస్టు డాక్టర్ పి. చంద్రశేఖర్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో డిజిటల్ యుగంలో యోగా పాత్ర అనే అంశంపై ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ కేతు శ్రీనివాసమూర్తి ప్రసంగించారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రపంచానికి యోగాను మన దేశమే పరిచయం చేసిందన్నారు. యోగా ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పుడు అనేక దేశాలు యోగాను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం యోగా, ప్రాణాయామం, ధ్యానం చేయాలని చెప్పారు. ఇవన్నీ ముందుగా గురువుల సమక్షంలో అభ్యసించాలని, వీడియోలు చూసి నేర్చుకుని యోగా చేయవద్దని సూచించారు. ఆసనాలు వేయడం ద్వారా శారీరక పటుత్వం కలుగుతుందని, రోజంతా చలాకీగా ఉంటారని తెలిపారు. అనంతరం లైఫ్ అచీవ్‌మెంట్ సాధించిన డాక్టర్ చంద్రశేఖర్‌ను హార్ట్ ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర కల్కూర, వెంకటరాముడు, వాసు, లక్ష్మన్న, ఎలమర్తి రమణయ్య, భవానీ ఘనంగా సన్మానించారు.


డాక్టర్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న హార్ట్ ఫౌండేషన్ సభ్యులు

రక్తదాన కార్యక్రమానికి విశేష స్పందన

కర్నూలు(హాస్పిటల్): జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు వెంకట్, కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక మెడికల్ రెప్స్ భవనంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ సురేష్, డాక్టర్ నాగేశ్వరరావు హాజరయ్యారు. శిబిరంలో 30 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రజా ఆరోగ్య వేదిక కన్వీనర్ ప్రసాదశర్మ మాట్లాడుతూ సమాజసేవలో మెడికల్ రెప్రజెంటేటివ్స్ భాగం పంచుకుంటున్నారన్నారు. ముఖ్యంగా ఉచిత వైద్యశిబిరాలు, కోవిడ్ సమయంలో వారు నిర్వహించిన పాత్ర వెలకట్టలేనిదని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కోటేశ్వరరావు, బసవరాజు, జిల్లా నాయకులు మారుతి, శేషాద్రి, ఖలీల్, శివరంగ, రాఘవేంద్ర, సురేంద్ర పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న మెడికల్ రెప్స్

సమాజంలో వైద్యుల పాత్ర ఎనలేనిది


సన్మానించిన వైద్యులు, ఆడిటర్లతో లయన్స్ క్లబ్ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో వైద్యుల పాత్ర ఎనలేనిదని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మాజీ గవర్నర్ డాక్టర్ బాలమద్దయ్య చెప్పారు. జాతీయ వైద్యుల దినోత్సవం, చార్టెట్ అకౌంటెంట్స్ డే సందర్భంగా ఆదివారం పలువురు వైద్యులు, ఆడిటర్లను సన్మానించారు. ఇందులో డాక్టర్ జయప్రకాష్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ బాలమద్దయ్య, డాక్టర్ వాదిరాజు, ఆడిటర్ బుచ్చన్న, జి. సురేంద్రనారెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలమద్దయ్య మాట్లాడుతూ రేపురా, మరోసారి చూద్దాం అనే మాట మాట్లాడకుండా వచ్చిన ప్రతి రోగికి తగిన విధంగా వైద్యసేవలను వైద్యులు అందిస్తారని కొనియాడారు. ఆడిటర్ బుచ్చన్న మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక స్థిరత్వం చాలా ప్రాధాన్యమైన అంశమని, అలాంటి సేవలను ఆడిటర్ల సహాయంతో పొందాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి లోకేష్, ఎంజేఎఫ్ నాయకులు దుర్గానాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పీవీ రాజ్‌కుమార్, బీవీ రమణగౌడ్, శ్రీనివాసబోస్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

- నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని పాతబస్టాండ్, వైఎస్ఆర్ సర్కిల్ వద్ద జరుగుతున్న మురుగు కాల్వల పనులు, సర్కిల్ పనులను కమిషనర్ పరిశీలించారు. అలాగే ఎస్‌టీబీసీ కళాశాల వద్ద, ఓల్డ్ ఎస్పీ బంగ్లా కల్వర్ట్ , కొండారెడ్డి బురుజు రోడ్డు డ్రెయిన్, ఫుట్‌పాత్ పనులను తనిఖీ చేశారు. పనుల ప్రగతి గురించి సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్ హుస్సేన్, డీఈఈ నరేష్‌లను అడిగి తెలుసుకున్నారు. మురుగు కాల్వల నిర్మాణాల్లో నాణ్యతను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలో రూ. కోట్లు విలువ చేసే అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఈఈలు రాచయ్య, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ హరీష్ చౌదరి పాల్గొన్నారు.


పాతబస్టాండ్ పోస్టాఫీసు వద్ద మురుగు కాల్వల పనులను పరిశీలిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ


సోలార్ డ్రయర్లలో ఆరబెట్టిన ఉల్లి ఫ్లేక్స్

ఉల్లి ముక్కలతో ఉపాధి

- స్వయం ఉపాధిలో రాణిస్తున్న వనితలు
- ఉల్లి కట్టర్, సోలార్ డ్రయర్లతో ఇంటి వద్దే ఉపాధి
- యంత్రాలకు బ్యాంక్ రుణ సదుపాయం

కల్లూరు: పొదుపు సంఘాల మహిళలు ఆహార ఉత్పత్తులు తయారు చేసి ఆర్థికంగా పురోగతి సాధిస్తున్నారు. పీఎంఎఫ్ఎంఈ (ప్రధాన మంత్రి ఫార్మలైసేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైస్) పథకం కింద యూనిట్లు పొందిన మహిళలు ఇంటి వద్దే ఉపాధి పొందుతున్నారు. మండలంలో తడకనపల్లె గ్రామంలో 48 ఉల్లి సోలార్ డ్రయర్ల యూనిట్లు అందజేయడంతో వనితలు స్వయం ఉపాధిలో రాణిస్తున్నారు.

సబ్సిడీపై యంత్రాలు

గ్రామంలో ఉల్లి కట్ చేయడానికి యంత్రం, షెడ్‌కు రుణ సౌకర్యం ఉంది. మిషన్ మొత్తం రూ.లక్ష కాగా ప్రభుత్వం రూ.35 వేలకే సబ్సిడీపై అందిస్తుంది. లబ్ధిదారుల వాటా రూ.10వేలు చెల్లిస్తే చాలు మిగతా సొమ్ముకు రుణ సదుపాయం ఉంటుంది. ఆ డబ్బును కంతుల వారీగా బ్యాంకుకు చెల్లించాలి.


తయారైన ఉల్లి ఫ్లేక్స్‌ను రవాణా చేస్తున్న దృశ్యం

ప్రభుత్వం తడకనపల్లె గ్రామంలో ఉల్లి ఫ్లేక్స్ తయారీ గురించి తెలుసుకోవడానికి ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పొదుపు సంఘాల మహిళలు వచ్చి పరిశీలిస్తున్నారు.

ఉపాధిని మెరుగుపర్చుకుంటున్న మహిళలు

ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఉపాధిని మెరుగుపర్చుకుంటున్నారు. గ్రామంలో ఇప్పటికే ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ కింద ఉల్లి ఫ్లేక్స్ మిషన్లు, 48 యూనిట్ల ఉల్లి సోలార్ డ్రయర్ల మిషన్లను వినియోగించుకొని ఆర్థికంగా కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

ఎస్‌ఫోర్ఎస్ కంపెనీ సహకారం

కట్ చేసిన ఉల్లిగడలను ఎఫ్‌బీడీలో 6 నుంచి 8 గంటలు ఆరబెట్టుకోవాలి. అనంతరం వాటిని సోలార్‌లో 2 గంటలు ఆరబెటడంతో ఎండిన ఉల్లి ముక్కలుగా తయారైన తరువాత మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు ఎస్‌ఫోర్ఎస్ కంపెనీ రవాణా చేస్తోంది. తయారీకి కావాల్సిన ఉల్లిగడ్డలను, అందుకు అవసరమయ్యే విద్యుత్ చార్జీలు, రవాణా ఖర్చులను ఆ కంపెనీ భరిస్తోంది.

నెలకు రూ.18వేలు ఆదాయం వస్తుంది


రోజు నాలుగు బ్యాగ్‌ల ఉల్లి గడ్డలను కట్ చేసి ముక్కలుగా (ఫ్లేక్స్) తయారు చేస్తున్నాను. దీంతో నెలకు రూ.18వేలు ఆదాయం వస్తుంది. బయట పనులకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటూ తక్కువ శ్రమతో ఎక్కువ ఆదాయం పొందుతున్నాను. పీఎంఎఫ్ఎంఈ పథకం ప్రవేశపెట్టడంతో మా గ్రామంలో బయట పనులకు వెళ్లకుండా ఊరిలోనే సమృద్ధిగా పని దొరుకుతుంది. ఉదయాన్నే ఇంట్లో పని మొదలు పెట్టి మధ్యాహ్నం కంతా అయిపోతుంది. అప్పటి నుంచి ఇంటి పనులు చేసుకుంటూ సంతోషంగా ఉన్నాం. – మదార్‌బీ, తడకనపల్లె

శ్రమ తక్కువ.. ఆదాయం ఎక్కువ


పొలంలో ఉదయం నుంచి సాయంత్రం పని చేస్తే రూ.200 నుంచి 250 మాత్రమే కూలీ వస్తుంది. ఉల్లి సోలార్ డ్రయర్లతో ఫ్లేక్స్ తయారు చేయడంతో తక్కువ శ్రమతో ఎక్కువ ఆదాయం పొందవచ్చు. తయారు చేసిన ఉల్లి ముక్కలను కంపెనీ వారే రవాణా చేసుకుంటారు. ప్రస్తుతం నెలకు రూ.15వేలు ఇంటి వద్ద ఉండి సంపదించుకుంటున్నాను. ఉల్లి కట్టర్, షెడ్‌కు బ్యాంక్ అధికారులు లోన్ సౌకర్యం కల్పించారు. దీంతో ఇంటి వద్దనే పని చేసుకుంటు జీవనోపాధి పొందుతున్నాను.
– రజియాబీ, తడకనపల్లె

నేడు కోడుమూరులో స్పందన

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయన్న ఆదివారం తెలిపారు. స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

నేడు స్పందన

గూడూరు: స్థానిక రెవిన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వ హిస్తామని తహసీల్దార్ శివశంకర్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు.

స్పందనకు గైర్హాజరైతే చర్యలు

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి అధికారులు గైర్హాజరైతే చర్యలు తప్పవని తహసీల్దార్ శేషఫణి ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేసీ కాల్వకు 189 క్యూసెక్కుల విడుదల

గూడూరు: సుంకేసుల డ్యామ్ నుంచి కర్నూలు నగర ప్రజలకు తాగు నీటి అవసరాల నిమిత్తం 189 క్యూ సెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఆదివారం డ్యామ్ అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో నిలిచి పోయిందని, డ్యామ్‌లో 0.990 టీఎంసీల నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

నేడు పంచలింగాలలో జగనన్న 'అమ్మఒడి'

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జగనన్న అమ్మఒడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎంఈఓ కే వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారన్నారు.

భూ ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోండి

సి.బెళగల్: తమ భూమిని ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని మండల పరిధిలోని ఈర్లదిన్నె గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరామిరెడ్డి అధికారులను కోరారు. ఆదివారం తమ సోదరుడు వెంకటేశ్వరరెడ్డి స్వగృహంలో తల్లి శంకరమ్మతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే నంబర్ 461/బీలో తమకు 6.20 ఎకరాలు ఉండగా, ఓ వ్యక్తి తన రాజకీయ బలగంతో 28 సెంట్ల భూమిని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. అధికారులు విచారించి న్యాయం చేయాలని కోరారు.

నేడు కోడుమూరులో గడప గడపకు మన ప్రభుత్వం

కోడుమూరు రూరల్ : కోడుమూరులోని గ్రామ సచివాలయం-3 పరిధిలోని కాలనీల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డా.సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరిస్తారన్నారు. అదే విధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతారన్నారు.

మహవీర్‌నగర్‌లో చైన్ స్నాచింగ్

కర్నూలు(అర్బన్): నగరంలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగులు అపహరించుకువెళ్లారు. మహవీర్‌నగర్‌కు చెందిన వెంకటేశ్వరమ్మ అనే మహిళ ఆదివారం దేవాలయానికి వెళ్లింది. రాత్రి 7.30 గంటల సమయంలో ఇంటికి వెళ్లేందుకు హైవేలో నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోని నాలుగున్నర తులాల బంగారు గొలు సును అపహరించుకువెళ్లారు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని ద ర్యాప్తు చేస్తున్నట్లు నాలుగో పట్టణ పోలీసులు తెలిపారు.